క్లుప్తంగా

ఆపద సమయంలో స్పందించాలి



కాటారం: ఆపద సమయంలో 108కి సమాచారం అందిన వెంటనే స్పందించి ఘటనా స్థలానికి చేరుకోవాలని 108, 102 జిల్లా అధికారి మేరుగు నరేశ్ సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం 108 పని తీరు, కండీషన్, వైద్య పరికరాలు పనిచేయు విధానం, రికార్డులను నరేశ్ పరిశీలించారు. వాహనాలు, సిబ్బంది పనితీరు, కేఎంపీఎల్ తదితర అంశాలపై ఆరా తీశారు. 108 సహాయం కోరే గర్భిణుల వద్దకు సకాలంలో చేరుకొని ఇబ్బందులు కలుగకుండా ఆస్పత్రికి చేరుకునేలా కృషిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. గర్భిణుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని కాళేశ్వరం వద్ద అత్యవసర వైద్య సేవల కోసం 108 అంబులెన్స్‌ను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. మూడు రోజుల పాటు భక్తులకు సేవలందించనున్నట్లు వివరించారు. జిల్లా అధికారి నరేశ్ వెంట ఈఎంటీ సత్యనారాయణ, పైలట్ రమేశ్ ఉన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



చిట్యాల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా కార్యదర్శి రాజేందర్ తెలిపారు. మండలంలోని జూకల్‌లో మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ అధ్యక్షతన కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు బీఆర్‌ఎస్ పార్టీ చేసేందేమి లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాంబాబు, గాజనాల రవీందర్, సుంధర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు మైదం శ్రీకాంత్, బండారి భద్రి, అవంచ రాజు, మండల అధికార ప్రతినిధి రాకేష్ పాల్గొన్నారు.

సన్మానం




కాటారం: గణతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జిల్లా స్థాయిలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన కాటారం ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి, కంప్యూటర్ ఆపరేటర్లు బాలు, భరత్‌ను శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఉపేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు షగీర్‌ఖాన్, బీరెల్లి కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొట్టిన బస్సు



టేకుమట్ల(రేగొండ): ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి బస్సు చెట్టును ఢీకొట్టిన సంఘటన సంఘటన రేగొండ మండలంలోని చెన్నాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ప్రయాణికులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ బుస్సు పరకాల నుంచి భూపాలపల్లికి వెళ్తుంది. ఈక్రమంలో చెన్నాపూర్ వద్ద బుస్సు ముందుగా వెళ్తున్న ద్విచక్ర వాహనం ఆకస్మాత్తుగా కుడి వైపునకు తిప్పడంతో తప్పించబోయి ప్రమాదవశాత్తు చెట్టును ఢీ కొట్టినట్లు తెలిపారు. దీంతో ఆరుగురికి స్వల్ప గాయాలు కాగా సమాచారం అందుకున్న ఎస్సై శ్రీకాంత్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను పరకాల ప్రైవేటు ఆస్పత్రికి పోలీస్ వాహనంలో తరలించారు.

వీఆర్‌ఏ మృతి


పోచయ్య (ఫైల్)

పలిమెల: మండలంలోని పంకెన గ్రామానికి చెందిన వీఆర్‌ఏ పాగె పోచయ్య (60) మృతిచెందారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈక్రమంలో శుక్రవారం తీవ్ర అస్వస్థకు గురికాగా, మహదేవ్‌పూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించాలని అక్కడి వైద్యులు సూచించారు. దాంతో ఎంజీఎంకు తరలించి వైద్యం అందిస్తున్న క్రమంలో మృతిచెందారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను పలువురు పరామర్శించారు.

సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

కాటారం: కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, నాయకులు



మహాముత్తారం: కేక్‌కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



మల్హర్: కేక్ కట్ చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ ప్రకాశ్‌రావు



జిల్లా వ్యాప్తంగా కేసీఆర్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, అభిమానులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఆస్పత్రుల్లో పండ్లు పంపిణీ చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించారు. ఉపాధిహామీ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం(జేఏసీ) ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని హెచ్‌ఎంఆర్‌డీఏస్ మానసిక దివ్యాంగులు ఆశ్రమంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొని కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సీఎం కేసీఆర్ అని అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ముందుకెళ్తున్న కేసీఆర్‌కు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


టేకుమట్లలో..


భూపాలపల్లి రూరల్: వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి దంపతులు


గోరికొత్తపల్లిలో..


కోటంచలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న నాయకులు


చిట్యాల: మజీద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


మొగుళ్లపల్లి: మొక్క నాటుతున్న వైద్య సిబ్బంది


రేగొండలో..


పలిమెలలో..


చిట్యాలలో..


మొగుళ్లపల్లిలో..

జర్నలిస్టుల దీక్ష విరమణ


దీక్ష విరమింపజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలో స్థానిక జర్నలిస్టులు 16 రోజులుగా చేపడుతున్న దీక్షలను శుక్రవారం విరమించారు. ఇంటి స్థలాల సాధన కోసం చేస్తున్న దీక్ష శిబిరానికి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి చేరుకొని జర్నలిస్టులకు స్పష్టమైన హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు ఇచ్చిన ఇంటి స్థలాల విషయంలో ఎవరు జోక్యం చేసుకోరని హామీ ఇవ్వడంతో ఎమ్మెల్యే గండ్ర సమక్షంలో జర్నలిస్టులు దీక్షను విరమించారు. దీక్షలకు జిల్లా కేంద్రంతో పాటు జిల్లా వ్యాప్తంగా సంఘీభావం తెలిపిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సింగరేణి కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు, యూత్ సంఘాలకు జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీ ఆదేశిస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తా!

- కాటారం పీఏసీఎస్ చైర్మన్ చల్లా నారాయణరెడ్డి


హోమం నిర్వహిస్తున్న నారాయణరెడ్డి దంపతులు

కాళేశ్వరం: సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆదేశిస్తే మంథని ఎమ్మెల్యేగా పార్టీ నుంచి 100శాతం పోటీ చేస్తానని, ఇతరులకు మద్దుతు ఇవ్వాలన్నా 100శాతం ఇస్తానని బీఆర్‌ఎస్‌పార్టీ రాష్ట్ర నాయకులు, కాటారం పీఏసీఎస్ చైర్మన్ చల్లా నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని కాళేశ్వరంలోని త్రివేణి సంగమ గోదావరి వద్ద కేసీఆర్ ప్రధాని కావాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతే మృత్యుంజయ జప హోమం నిర్వహించారు. అనంతరం కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. అనంతరం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయన వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా పోటీచేస్తాననే వ్యాఖ్యలు ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారాయి.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

మల్హర్: ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే మంథని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ రాష్ట్ర నాయకుడు చందుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండలంలోని ఇప్పలపల్లి, పీవీనగర్, దుబ్బపేట, గాదెంపల్లి, కిషన్‌రావుపల్లి, పెద్దతూండ్ల గ్రామాల్లో సునీల్‌రెడ్డి శుక్రవారం రోడ్ షో నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ కమలం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 12 సంవత్సరాలుగా నియోజకవర్గ మార్పుకు ఆరాట పడుతున్నట్లు తెలిపారు. అమెరికాలో ఉన్నత ఉదోగ్యం వదిలి ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడినట్లు గుర్తుచేశారు. తన జీవితం మంథని ప్రాంతానికి అంకితం చేశానని, ఒక్క సారి సేవ చేసే భాగ్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కన్నం యుగదీశ్వర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెన్నంపల్లి పాపన్న, మండలాల అధ్యక్షులు మల్క మోహన్‌రావు, భాస్కర్‌రెడ్డి, సంపత్, నిరంజన్, కాటారం మండల ఇన్‌చార్జ్ వసంతరెడ్డి, జిల్లా కోశాధికారి దుర్గం తిరుపతి యాత్ర సహా ప్రముఖ్ తిరుపతి, మహిళ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి విజయరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు నవీన్ నాయక్, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జ్ లింగన్నపేట అశోక్, నాయకులు రమేశ్, శ్రీనివాస్, కాంత్రికుమార్, అంకయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఎన్నిక

భూపాలపల్లి రూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీలను నియమిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ కాల్వరాజేందర్ పేర్కొన్నారు. మండలంలో రాంపూర్‌గ్రామంలో శుక్రవారం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా నీలాల లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడిగా సమ్మయ్య, కార్యదర్శిగా కాసిపాక పోషయ్య, ప్రచార కార్యదర్శిగా నర్సయ్యలను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కాల్వ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు సర్వం సిద్ధం

- నేటి శివరాత్రి వేడుకలకు ముస్తాబైన చెన్నకేశవ ఆలయం
- ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు


పర్లపల్లిలోని చెన్నకేశవ ఆలయం


ఆలయంలోని శివలింగం

మొగుళ్లపల్లి: రాతి కట్టడాలతో ఒకే చోట మూడు గోపురాలతో నిర్మించిన బ్రహ్మ ,విష్ణు, మహేశ్వరుల ఆలయంగా మండలంలోని పర్లపల్లి గ్రామ చెన్నకేశవ ఆలయం పేరుగాంచింది. కాకతీయుల నాటి కట్టడాలతో నిత్యం పూజలు అందుకుంటున్న త్రిమూర్తుల ఆలయం జిల్లాలోనే ఏకైక ఆలయంగా ప్రసిద్ధిగాంచింది. క్రీస్తుశకం 12వ శతాబ్దంలో మండలంలోని పర్లపల్లి గ్రామంలో శివ, చెన్నకేశవ ఆలయాన్ని కాకతీయులు నిర్మించారు. పూర్తిగా గోపురం వరకు రాతితో నిర్మించి మధ్యగోపురం గుడిలో విష్ణుమూర్తిని, పక్కన శంకరుడు, ఎదురుగా బ్రహ్మలను ప్రతిష్ఠించారు. మూడు గర్భగుడులకు మధ్యలో వినాయకుడిని, నందిని ఏర్పాటు చేశారు.

ప్రత్యేక పూజలు

ప్రతీ సంవత్సరం గ్రామంలో శివరాత్రి వేడుకులను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. శివరాత్రి పర్వదినం పురస్కరించుకోని ఉదయం అభిషేకాలు, సాయంత్రం రుద్రహోమం, రాత్రి శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తారు. నేటి(శనివారం) శివరాత్రి ఉత్సవాలకు కూడా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలకు బుజూనూరు, సీతంపేట, వంతడుపుల, గణేష్‌పల్లి, పెద్దకోమటిపల్లి తో పాలు పలు గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొననున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం..



శివరాత్రి సందర్భంగా ఆలయంలో ఉదయం అభిషేకాలు, సాయంత్రం రుద్రహోమం, రాత్రి శివపార్వతుల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహిస్తాం. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– గాజుల రాజయ్య, నిర్వాహకుడు

కాకతీయుల కళా నైపుణ్యం గొప్పది



మూడు ఆలయూలను రాతి కట్టడంలో నిర్మించిన కాకతీయుల కళా నైపుణ్యం గొప్పది. ఇప్పటివరకు సుమారు వెయ్యి సంవత్సరాలైనా ఆలయం చెక్కు చెదరకుండా ఉండడం విశేషం. ఇలాంటిపురాతన కట్టడాలను కాపాడుకోవడం అవసరం. అందుకు దేవాదాయ శాఖ చొరవచూపాలి.

– అక్కపెల్లి శ్రీనివాస్, పర్లపల్లి

నిత్యం పూజలు



మా తాతల కాలం నుంచి ఈ ఆలయం ఉంది. అప్పటినుంచి ఇప్పటివరకు నిత్యం ధూపదీప నైవేద్యాలు అందిస్తున్నారు. శివరాత్రి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై త్రిమూర్తులను భక్తితో కొలిచి తమ మొక్కులు చెల్లించుకుంటారు.

–గోలి కృష్ణారెడ్డి, పర్లపల్లి

హుండీలు, దాన బస్తాలు అందజేత


హుండీలు బహూకరిస్తున్న దాతలు

గణపురం: కాకతీయుల కళా క్షేత్రం కోటగుళ్లలో నేడు జరిగే మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు శుక్రవారం హుండీలు, ఆలయ గోవులకు దాన బస్తాలను అందించారు. గణపురం మండల కేంద్రానికి చెందిన పబ్బ సరోజన–రాజయ్య దంపతులు, కల్యాణి శంకర్ గౌడ్ దంపతులు రూ.20వేల విలువ చేసే రెండు స్టీల్ హుండీలను అందజేశారు. మండలంలోని చెల్పూరు వీరయ్యపల్లె గ్రామానికి చెందిన అడ్డూరి మంజుల శ్రీధర్‌రావు దంపతుల కూతురు డాక్టర్ హిరణ్య గోశాలకు రూ.5వేల విలువ చేసే దాన బస్తాలు అందించారు. దాతలకు ఆలయ అర్చకుడు నరేష్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో కోటగుళ్ల పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షుడు మామిండ్ల మల్లికార్జున్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఎర్రబెల్లిని కలిసిన ఎంపీటీసీ


దయాకర్‌రావును సన్మానిస్తున్న సంపత్‌రావు

టేకుమట్ల: పంచాయతీ రాజ్ శాఖామాత్యులు ఎర్రబెల్లి దయాకర్‌రావును దుబ్యాల ఎంపీటీసీ బిక్కనేని సంపత్ రావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి, నిధులపై చర్చించి, మరిన్ని నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ నాగుల సంపత్ ఉన్నారు.